క్లుప్తంగా

సభ్యత్వంతో గ్రంథాలయాలకు ఉపయోగాలు


చదవడం మాకిష్టం కార్యక్రమంలో విద్యార్థులు

ఒంగోలు మెట్రో: ప్రతి విద్యార్థి గ్రంథాలయంలో సభ్యత్వం తీసుకోవడం వలన గ్రంథాలయ అభివృద్ధికి పాటుపడినవారవుతారని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలు నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ కాళహస్తి సంపూర్ణ మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యార్థులకు చదవడం మాకిష్టం కార్యక్రమం జరుగుతుందన్నారు. విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించి గ్రంథాలయానికి పంపించాలని ఆమె కోరారు. ప్రతి ఒక్కరూ శాశ్వత సభ్యత్వం తీసుకుని పుస్తకాలు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం విద్యార్థులకు పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, పలు రకాల ఆటలు ఆడించారు. కార్యక్రమంలో మాస్టర్ జాలాది మోహన్‌బాబాబు, అనిల్‌బాబు, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

దానాల్లో అన్నదానం గొప్పది


పేదలకు అన్నదానం చేస్తున్న సేవా సంకల్ప ట్రస్ట్ సభ్యులు

సంతనూతలపాడు(చీమకుర్తి రూరల్): అన్ని దానాల్లో కెల్లా అన్నదాన గొప్పదని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం సంతనూతలపాడులో సేవా సంకల్ప ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ ఫౌండర్ ఎస్ఆర్ఐ పాతూరు సంపత్, ట్రస్ట్ చైర్మన్ శనగల వెంకటరమణ పర్యవేక్షణలో గత 56 వారాల నుంచి దేశ విదేశాల నుంచి దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం, మెడికల్ క్యాంపులను, విద్యా ప్రోత్సాహక, తదితర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ కుటుంబాల్లో పుట్టినరోజు, పెళ్లిరోజు, వర్ధంతి వేడుకలు తదితర కార్యక్రమాలకు ఆయా వర్గీయులు ట్రస్టుకు సహకరిస్తే వారి పేరుతో పేద వర్గాలకు అన్నదానం నిర్వహిస్తామన్నారు. వివరాలకు 96188 92535 సంప్రదించాలని కోరారు. ఏఎస్సై వెంకట్రావు, వైస్ చైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరి, ట్రస్ట్ సభ్యులు శీలం మల్లారెడ్డి, కొప్పోలు శ్రీనివాసరావు, ఆర్. జార్జి, తదితరులు పాల్గొన్నారు.

ఆహా.. ఇంజినీర్ల చిత్రాలే వేరయా !


భాగ్యనగర్ 4వ లైన్‌లో విద్యుత్ లైన్‌లను పక్కకు జరుపకుండానే వేసిన సిమెంట్ రోడ్డు


రోడ్డు మధ్యలో వదిలేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభం

- హాస్యాస్పదంగా మున్సిపల్ ఇంజినీర్ల పనితీరు
- విద్యుత్ లైన్లను పక్కకు మార్చకుండానే సిమెంట్ రోడ్డు నిర్మాణం
- వాడుకలో ఉన్న బోరును కూడా వదిలేసిన వైనం
- రూ.2 కోట్ల విలువైన సిమెంటు రోడ్డు నిర్మాణ పనుల్లో చిత్రవిచిత్రాలు


వాడుకలో ఉన్న బోరును కూడా ఇలా వదిలేశారు

ఒంగోలు సబర్బన్: వారు చదువున్న వారు.. పైగా ప్రభుత్వ ఉన్నతాధికారులు. ఏ పని చేపట్టాలన్నా కచ్చితత్వంతో నాణ్యతతో కూడిన పనులను సిఫార్సు చేస్తారు. కాని ఎందుకనో ఈ మధ్య వారు చేస్తున్న పనులతో ప్రజల్లో చులకనవుతున్నారు. ఒంగోలు నగరంలో పనిచేస్తున్న ఒంగోలు నగర పాలక సంస్థ ఇంజినీర్ల పనితీరు అక్కడ జరిగిన పనులను బట్టి చూస్తేనే అర్థమవుతుంది. అందుకు నిదర్శనమే నగరంలోని భాగ్యనగర్ నాలుగో ప్రధాన రహదారి సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు. ఈరోడ్డు నిర్మాణ పనులు చూసిన సామాన్యుడు సైతం అయ్యో ఇదేందీ.. రోడ్డును అడ్డదిడ్డంగా వేశారని ముక్కున వేలేసుకుంటున్నాడు. భాగ్యనగర్ నాలుగో ప్రధాన రోడ్డు నిర్మాణానికి నగర పాలక సంస్థ అధికారులు దాదాపు రూ.2 కోట్లు మంజూరు చేశారు. రోడ్డు ప్రారంభం ట్రంకు రోడ్డు నుంచి అంటే నాలుగో తరగతి ఉద్యోగుల భవనం కమాన్ మొదలుకొని హౌసింగ్ బోర్డు కాలనీలోని దామచర్ల సక్కుబాయమ్మ పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లే రోడ్డు వరకు సిమెంటు రోడ్డు నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. ఎన్నో అడ్డంకులు, అవాంతరాలు తప్పించుకొని చివరకు రోడ్డు నిర్మాణానికి కాంట్రాక్టర్ పూనుకున్నాడు. అయితే రోడ్డు నిర్మాణమే అడ్డగోలుగా చేస్తున్నారు. అంతేకాదు ఈ నాలుగో లైన్‌లో పారిశుధ్యం అత్యంత దరిద్రంగా ఉంటుంది. ప్రతి క్రాస్ రోడ్డు వద్ద ఎక్కడపడితే అక్కడ చెత్తచెదారాలు, వ్యర్థాలు పడేస్తున్నారు. కాలువల్లో ఏ ఆరు నెలలకో పూడిక తీస్తున్నారు. ప్రతి క్రాస్‌రోడ్డులోని ఇంటి వద్ద కాల్వల్లో దుర్గంధభరితమైన వాసన వెదజల్లుతుంటుంది.

కాంట్రాక్టర్‌తో కుమ్మక్కైన ఇంజినీర్లు..

నగర పాలక సంస్థలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ అధికారులు నిబంధనలను తుంగలో తొక్కి మరీ రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నారు. భాగ్యనగర్ క్రాస్ రోడ్డులు 6, 7, 8 ప్రాంతాల్లో రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అదేవిధంగా వదిలేసి మీరి సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డు మార్జిన్ నుంచి దాదాపు 10 అడుగుల లోపలకు సిమెంటు రోడ్డులో ఉంది. అదేవిధంగా ఆ లైన్‌లోని విద్యుత్ స్తంభాలు సైతం అలాగే వదిలేశారు. వాడుకలో ఉన్న బోరును కూడా అదేవిధంగా వదిలేశారు. రోడ్డు నిర్మాణ సమయంలో తీసుకోవాల్సిన కనీస నిబంధనలు కూడా పాటించకుండా ఎక్కడివక్కడే వదిలేసి సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపడితే భవిష్యత్‌లో ఈ రోడ్డుపై వాహనాల రాకపోకలు ఏవిధంగా కొనసాగించాలి. ప్రజలు ఏవిధంగా ఈ రోడ్డుపై నడవాలన్న దానిని గాలికి వదిలేసిన నగర పాలక సంస్థ అధికారులు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై అడ్డదిడ్డంగా రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే భవిష్యత్‌లో ఈ రోడ్డులో ప్రయాణించే వాహనదారులు, ప్రజలు ఎన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అసలే ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉండే రోడ్డు కూడా. అందులోనూ వెంగముక్కల పాలెం జంక్షన్‌లోని బైపాస్ రోడ్డుకు ఇది లింకు రోడ్డు కూడాను. ఇప్పటికైనా ఇంజినీరింగ్ అధికారులు నగరంలో ఎక్కడ రోడ్డు వేసినా ఇలాంటివి ముందే తొలగించి రోడ్లు వేయాలని కోరుకుందాం.

సంక్షేమ పథకాల అమలులో కూటమి విఫలం


మాట్లాడుతున్న ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ రవిబాబు

- నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు ధ్వజం

ఒంగోలు సిటీ: ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు అన్నారు. శనివారం రాత్రి ఒంగోలు పట్టణంలోని 13 డివిజన్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికలకు ముందు చెప్పిన హామీలు ఒక్కటి కూడా అమలు చెయ్యకుండా, ప్రజల్ని మోసం చేస్తూ తన అద్భుతమైన నటనతో అబద్ధాలు చెప్తూ ప్రజల్ని మభ్యపెడుతున్నాడని విమర్శించారు. వైఎస్సార్ సీపీ నాయకుల మీద రోజు కేసులు పెడుతూ శునకానందం పొందుతున్నాడని విమర్శించారు. గతంలో పార్టీలో ఉన్న నాయకులు పార్టీని వాడుకొని పదవులు పొంది మోసం చేశారన్నారు. పార్టీకి ప్రతి డివిజన్‌లోని కార్యకర్తలు కూడా మద్దతుగా నిలిచి పూర్తి సహకారాన్ని ఇస్తున్నారన్నారు. వారిని నేను ఎన్నటికీ మరిచిపోనని, వారికీ పార్టీ అధికారంలోకి వచ్చాక న్యాయం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు నగర అధ్యక్షులు కఠారి శంకరరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు దామరాజు క్రాంతికుమార్, ప్రేమ్ కుమార్, పాలడుగు రాజీవ్, లూమియల్ రాజు, చిన్న, బుజ్జి, అప్సర బేగం, ప్రసన్న, మేరీ, వాణి, డివిజన్ అధ్యక్షులు ఎం సూర్య రాజేష్, సోషల్ మీడియా నగర అధ్యక్షుడు చావల పీటర్, 11వ డివిజన్ కార్పొరేటర్ ప్రవీణ్‌కుమార్, కార్పొరేటర్ ఇమ్రాన్‌ఖాన్, కో ఆప్షన్ సాగర్, దేవా, శ్రీకాంత్, చందు, శోభలత, మున్నీ, రవి, పృథ్వీ, సన్నీ, సూరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మూగజీవాల మేతకు భూములు కేటాయించాలి


మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట్రావు

నాగులుప్పలపాడు: గొర్రెలు, మేకల మేత నిమిత్తం ప్రభుత్వ భూములు కేటాయించాలని ఏపీ గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పూసపాటి వెంకటరావు జిల్లా కార్యదర్శి తోట తిరుపతరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలం ఏపీ గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం నాగులుప్పలపాడు మండల మహాసభ ఉప్పుగుండూరులో యాదవ కమ్యూనిటీ హాల్లో నిర్వహించారు. ఈ సభకు గ్రామ గొర్రెల సహకార సంఘం అధ్యక్షుడు భాస్కరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట్రావు మాట్లాడుతూ ఏ ప్రభుత్వం వచ్చినా కాపర్లను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా గ్రామాల్లో ఈ సీజన్‌లో పంటలు వేసిన తర్వాత మేత వనరులు నిలబెట్టుకోవడానికి జాగాలు లేక కాపర్లు పలు ఇబ్బందులు పడుతున్నారని, డొంకదారులు, కుంటలు ఆక్రమణలకు గురి కావడం వలన జీవాలకు మేత కొరత తీవ్రంగా ఏర్పడుతుందన్నారు. దీని వలన పెంపకందారులు అనేక దూర ప్రాంతాలకు వలసలు పోయి రోడ్డు ప్రమాదాల బారినపడడంతో పాటు పాముకాటు, పిడుగు పాట్లకు గురై మరణిస్తున్నారని తెలిపారు.

గొర్రెల కాపరులను మోసం చేసిన ప్రభుత్వం..

జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గొర్రెల కాపరులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఉప్పుగుండూరు మేజర్ పంచాయతీ అని సుమారు 5000 వేల గొర్రెలు వందలాది పశువులు ఉన్నా ఇక్కడ పశువైద్యశాలలో సీనియర్ డాక్టర్ లేనందువలన వైద్యం సరిగా అందడం లేదన్నారు. ప్రైవేటు వైద్యాన్ని ఆశ్రయించాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. 90 శాతం సబ్సిడీతో షెడ్లు అందరికీ ఇవ్వాలని 50 ఏళ్లకే రూ.5 వేల పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా నక్కల శ్రీకాంత్, కొనికి రాఘవను కమిటీ సభ్యులుగా మసిముక్కు భాస్కరరావు, భట్టు వెంకట్రావు ఈర్ల మహేష్, కొండపి నాగరాజు, వీరభద్రయ్య మసనం శివయ్య, అత్తింటి అంజయ్య, గుమ్మా వెంకట్రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కాకాని సుబ్బారావు, రజకవృత్తిదారుల సంఘం కళ్లకుంట శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఉప్పుగుండూరు వెంకటేశ్వర్లు వివిధ గ్రామాల గొర్రెల కాపర్లు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి పొంగళ్లు సమర్పించిన బూచేపల్లి కుటుంబం


గంగమ్మ తల్లికి పొంగళ్లు తీసుకు వెళ్తున్న బూచేపల్లి కుటుంబం


గంగమ్మ తల్లికి హారతినిస్తున్న, శివప్రసాదరెడ్డి, నందిని, వెంకాయమ్మ

చీమకుర్తి రూరల్: రామతీర్థం పుణ్యక్షేత్రంలో బూచేపల్లి కుటుంబం గంగమ్మతల్లికి పొంగళ్లు పెట్టారు. ఆదివారం గంగమ్మతల్లి గుడిలో ప్రకాశం జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జిల్లా చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి నందిని, గంగమ్మతల్లికి హారతినిచ్చి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మోక్ష రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం సూర్య క్వారీ కార్మికులకు అన్నదాన కార్యక్రమం నిర్వహంచారు. కార్యక్రమంలో బూచేపల్లి రిలాసారెడ్డి, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు రామసాని సూర్యం, గోగినేని వెంకటేశ్వర్లు, బూచేపల్లి నాగిరెడ్డి, గంగిరెడ్డి ఒబుల్‌రెడ్డి, దాసరి లక్ష్మినారాయణ, కత్తి రమణారెడ్డి మన్నం శ్రీధర్‌బాబు, చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, టౌన్ పార్టీ అధ్యక్షుడు కిష్టపాటి శేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు పాటిబండ్ల గంగయ్య, బాబురావు, బెల్లం వెంకటరావు, శేషాద్రి, పత్తి కోటేశ్వరావు, యల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవల్లో రోటరీ ముందంజ


దివ్యాంగులకు ట్రై సైకిళ్లను అందిస్తున్న క్లబ్ నిర్వాహకులు

చీమకుర్తి: రోటరీక్లబ్ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో సేవలను విస్తృతం చేస్తామని నూతనంగా బాధ్యతలను స్వీకరించిన కార్యవర్గం భరోసా ఇచ్చారు. ఆదివారం చీమకుర్తిలోని చెరుకూరి వెంకటేశ్వర్లు ఇండోర్ స్టేడియంలో నూతన కార్యవర్గం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోటరీక్లబ్ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్, ఉచిత మెగా మెడికల్ చెకప్ క్యాంప్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా తొగటి శ్రీను, కార్యదర్శిగా పారెళ్ల శ్రీనివాసరావు, కోశాధికారిగా దుడ్డు శంకర్‌రావు నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారి చేతుల మీదుగా ఏడుగురు బాలికలకు సైకిళ్లు, నలుగురుకు ట్రైసైకిళ్లను అందించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ వ్యవస్థాపకులు చెరుకూరి రఘుకిరణ్, ఏ.రత్న ప్రభాకర్, సీహెచ్ బసవరాములు, మన్నం ప్రసాద్, పూనాటి వెంకట్రావు, ఏ.వీరారెడ్డి, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్ష, కార్యదర్శులు ఎడ్లపల్లి రామబ్రహ్మం, పరాంకుశం శ్రీనివాసమూర్తి, గొల్లపూడి వెంకట్రావు, పోకూరి రామకృష్ణారెడ్డి, గొల్లపూడి చౌదరి, స్థానికులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

చీమకుర్తి: చీమకుర్తి మున్సిపల్ కార్మికులు ఆదివారం కార్యాలయం ఎదుట అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. తమ డిమాండ్‌లను పరిష్కరించాలని చేస్తున్న సమ్మె ఐదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ కాలపరిమితి 62 సంవత్సరాలకు పెంచాలని, 36 జీఓ ప్రకారం వేతనాలు చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను అందించాలనే పలు రకాల డిమాండ్‌లతో వారు నిరసన వ్యక్తం చేశారు.

జోరువానతో స్తంభించిన నగరం

- ఆగకుండా గంటన్నరకు పైగా కురిసిన వర్షం
- కాలువల్లో మురుగు మొత్తం రోడ్ల మీదనే

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంలో ఆదివారం జోరుగా వర్షం కురిసింది. సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమయిన వర్షం గంటన్నరకు పైగా కురుస్తూనే ఉంది. పెద్ద జల్లు పడటంతో నగరంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. నగరంలోని శివారు కాలనీల్లో కొన్ని ప్రాంతాల్లో రోడ్లు కాలువలను తలిపించాయి. ఆగకుండా కురిసిన వర్షానికి నగరంలోని మురుగు కాలువల్లోని మురుగు మొత్తం రోడ్ల మీదకు వచ్చేసింది. రోడ్లు మొత్తం మురుగుమయంగా మారాయి. వర్షం పడితే చాలు దక్షిణ బైపాస్ నుంచి నెల్లూరు బస్టాండ్ వరకు రోడ్డు మొత్తం నీటితో ఉండి వాహనదారులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. డీ మార్ట్, రిమ్స్ వద్ద వాహనాల రాకపోకలకు కూడా తీవ్ర ఇబ్బందిగా మారింది. ఇక మస్తాన్ దర్గా సెంటర్, పాత మార్కెట్ సెంటర్ బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ మొదటి గేటు ఎదురు పరిస్థితి ఇక చెప్పనక్కరలేదు. అదేవిధంగా ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లోని బస్సులు బయటకు వచ్చే రోడ్డు బస్టాండ్ లోపలి వరకు నీటితో నిండిపోయింది. నగర శివారు ప్రాంతాల ప్రజలు ఒక్కరోజు అధికంగా కురిసిన వర్షానికే అల్లాడిపోతున్నారు. ఒంగోలు నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల చిరు జల్లులు కురవగా మరికొన్ని అధికంగానే వర్షం కురిసింది. గత ఆరు రోజులుగా పారిశుధ్య కార్మికులు దాదాపు 680 మందికి పైగా సమ్మె చేస్తున్నారు. దాంతో కాలువల్లో మురుగు బయటకు తీసే నాథుడే కరువయ్యాడు. అందువల్ల ఇన్ని రోజులుగా కార్మికులు సమ్మెలో ఉండటంతో నగరంలో కురిసిన వర్షానికి రోడ్లు మురుగుమయంగా మారాయి.

యూటీఎఫ్‌కు శిద్దా సహకారం అభినందనీయం


శిద్దా రాఘవరావును సత్కరిస్తున్న యూటీఎఫ్ టీచర్స్

చీమకుర్తి: మాజీ మంత్రి శిద్దా రాఘవరావు యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన విద్యా సదస్సుకు అందించిన సహకారం అభినందనీయమని ఆ సంఘం నాయకులు తెలిపారు. ఆదివారం ఒంగోలులోని శిద్దా నివాసంలో యూటీఎఫ్ నాయకులు శిద్దా రాఘవరావును కలిసి శాలువతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. విద్యా సదస్సుకు ఆయన అందించిన సహకారం మరవులేమన్నారు. అభినందనలు తెలిపిన వారిలో యూటీఎఫ్ నాయకులు షేక్ శిలార్‌సాహెబ్, నల్లూరి వెంకటేశ్వరరావు, చలువాది శ్రీనివాసరావు, చిన్నస్వామి, పీ.వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, శ్రీను, నాగార్జున ఉన్నారు.

23న భారీ జాతీయ పతాక ప్రదర్శన

ఒంగోలు మెట్రో: గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో భాగంగా వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో భారీ జాతీయ జెండా ప్రదర్శన నిర్వహించనున్నారు. క్లబ్ సభ్యులు నగరంలోని శివగంగ అన్నదాన ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఇరుకుల రామకృష్ణ ఆదేశాల ప్రకారం ఈనెల 23వ తేదీ బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు క్లబ్ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ శిద్దా సూర్య ప్రకాష్ ఆధ్వర్యంలో జాతీయ పతాకం ప్రదర్శన ఉంటుందని తెలిపారు. స్థానిక కర్నూలు రోడ్ ఫ్లైఓవర్ వద్ద నుంచి అద్దంకి బస్టాండ్ బాపూజీ కాంప్లెక్స్ వరకు ఒంగోలు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్ లో భాగంగా ప్రత్యేకంగా తయారు చేసిన 3600 అడుగుల అతి పొడవైన మువ్వన్నెల జెండా ప్రదర్శన నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, రాజకీయ నాయకులు నగరంలోని ప్రజలు ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. క్లబ్ వారి ఆధ్వర్యంలో 3500 విద్యార్థులతో ప్రతిష్టాత్మకంగా జరుగుతుందని ప్రోగ్రాం కో ఆర్డినేటర్‌లు కొండేటి వెంకట సురేష్ బాబు, కనుమర్లపూడి హరిప్రసాద్ తెలిపారు.

ఆలయాల్లో ఆడి కృత్తికా మహోత్సవాలు

ఒంగోలు మెట్రో: జిల్లా వ్యాప్తంగా సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో ఆడి కృత్తికా మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆషాఢ మాసంలో వచ్చే ఆడి కృత్తికా సందర్భంగా సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో ఉదయం నుంచి భక్తులు బారులు తీరారు. ఒంగోలు నగరంలో రంగారాయుడు చెరువు దగ్గర ఉన్న సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానం, మంగమూరు డొంక హరిహరసుత అయ్యప్ప స్వామి క్షేత్రంలో ఉపాలయంగా ఉన్న సుబ్రహ్మణ్యస్వామికి, సీతారాంపురంలోని సుబ్రహ్మణ్యస్వామి, ఒంగోలు కొండమీద స్కందగిరి వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి, కొత్తపట్నం బస్టాండు అయ్యప్పస్వామి క్షేత్రంలో ఉపాలయంగా ఉన్న సుబ్రహ్మణ్యస్వామికి, ఆలయ అర్చకులు ఉదయం మూలవిరాట్‌కు పంచామృతాలు, సుగంధ పరిమళ ద్రవ్యాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి శాస్త్రోక్తంగా భక్తిశ్రద్ధలతో కల్యాణం జరిపించారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్ల కల్యాణం తిలకించారు.


కొత్తపట్నం బస్టాండ్ అయ్యప్పస్వామి క్షేత్రంలో పూజలో పాల్గొన్న భక్తులు


మంగమూరుడొంక అయ్యప్పస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామివారు